క్లుప్తంగా

కొడంగల్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న గుల్షన్

కొడంగల్ రూరల్: ప్రభుత్వం కొడంగల్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి గుల్షన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా, వినాయక చౌరస్తాలు ఇరుకుగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆర్టీసీ బస్టాండు ఎదుట కాంప్లెక్స్‌నిర్మాణం చేపడతామని నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోవడంలేదన్నారు. శిథిలావస్థకు చేరిన షాదీఖానాకు నూతన భవన నిర్మాణం చేపట్టాలని ఎన్ని పర్యాయాలు అధికారులకు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఎడీ సర్తజ్ హుస్సేన్, సయ్యద్ ముస్తాఫా, షేక్ ఆబిద్, షేక్‌రోమన్, ఎండీ అజహర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన



గొంగుపల్లిలో లబ్ధిదారునితో అధికారులు, నాయకులు

పూడూరు: ప్రజాపాలనలో గ్రామాల్లో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి అర్హులను నమోదు చేస్తున్నారు. శుక్రవారం మండల పరిధిలోని గొంగుపల్లి, పూడూరు, సోమన్‌గుర్తి తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు దారుల ఇంటింటికి తిరుగుతూ పరిశీలించారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని ఇందిరమ్మ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు, సీఐటీయూ నాయకులు

తాండూరు రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తాండూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కార్మికులకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సిములు, అంబరప్ప, మల్లేశ్, షబ్బీర్, హరీశ్, శివరాం, రవి, కిష్టప్ప, నర్సిములు, చందు, లక్ష్మి, వీరప్ప, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాజీ ప్రధాని మన్‌మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

యూటీఎఫ్ మహాసభలకు తరలిరావాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పరిగి: నల్లగొండలో నిర్వహించనున్న యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలకు భారీగా తరలి రావాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో మండల విద్యాధికారి గోపాల్ మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు మాట్లాడుతూ 28, 29, 30న రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తారన్నారు. ఈ రాష్ట్ర మహాసభలో ఉపాధ్యాయ, విద్యార్థుల సమస్యలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దశరథ్, జిల్లా ఉపాధ్యక్షుడు జమున, మోయిజ్, బసప్ప, శంకర్, వెంకటయ్య, బిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువు.. బరువు!

- రోజురోజుకు పెరుగుతున్న ధర
- ఒక్కో బస్తాపై రూ.100లు
- అన్నదాతలకు భారం
- సబ్సిడీపై అందించాలంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎరువుల బస్తాలు

దుద్యాల్: ప్రస్తుత పరిస్థితుల్లో పంటల సాగు భారంగా మారింది. అన్నదాతల పరిస్థితి దయనీయంగా మారుతోంది. రోజురోజుకు సేద్యపు ఖర్చులు పెరగడంతో పాటు ఎరువుల ధరలు కూడా బరువయ్యాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వారిని ఆదుకునే వారు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఇప్పటికీ ఏటా ప్రభుత్వం అందజేసే పెట్టుబడి సాయం కూడా అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.15 వేలు ఇస్తామన్న ప్రభుత్వం వాటిని నేటికి విడుదల చేయకపోవడంతో అన్నదాతలు నిరాశకు గురవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల పంట దిగుబడులు తగ్గాయి. అరకొర దిగుబడులతో పాటు పంటకు సరైన గిట్టుబాటు దక్కకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. ఖరీఫ్ కష్టాలను ఎదురీదుతూ రబీ సీజన్ పంటలను సాగు చేస్తున్నారు. వేరుశనగా, బుడ్డ శనగా, జొన్న పంటల సాగు మండలంలో అధికంగానే సాగవుతున్నాయి. రైతులు ఎక్కువగా వినియోగించే కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరగడంతో అవి భారంగా మారాయి. ఒక్కో రకం ఎరువు బస్తాపై రూ.100 పెంచేశారు.

అవసరాని కంటే తక్కువ వినియోగం

ఆయా పంటలకు సమతుల్యంగా ఎరువులు వినియోగిస్తే ఆశించిన దిగుబడులు వస్తాయి. ఎరువుల ధరలు పెరగడంతో రైతులు వాటిని తక్కువగా వాడుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో వరి పంటకు డీఏపీ ఎరువును దాదాపుగా 50కిలోలు వేయాల్సి ఉంటది. కానీ రైతులు ధరలను చూసి బిత్తరపోయి ఏకంగా సగానికి సగం తగ్గించి 25–30 కిలోల వరకు మాత్రమే వేస్తున్నారు. దానికి తోడు తక్కువ ధర ఉన్న యూరియాను అధికంగా వాడుతున్నారు. యూరియా అధికంగా వాడడంతో పంట దిగుబడిపై ప్రభావం పడి నష్ట పోతున్నారు.

పెరిగిన ఎరువుల ధర

పంటలకు అధికంగా వినియోగించే కాంప్లెక్స్ ఎరువల ధరలు మాత్రమే పెరగడంతో రైతన్నలు దిగులు చెందుతున్నారు.

వివరాలు ఇలా..

- 20:20:0:13 ఎరువు బస్తా గతంలో రూ.1,200 ఉండగా ప్రస్తుతం రూ.1,300లకు పెరిగింది.
- 28:28 ఎరువు బస్తా గతంలో రూ. 1,700 ఉండగా ప్రస్తుతం రూ. 1800లకు చేరింది.
- 14:35 ఎరువు బస్తా గతంలో రూ.1,700 ఉండగా ప్రస్తుతం రూ. 1800లకు విక్రయిస్తున్నారు. వీటితో పాటు డీఏపీ ఒక బస్తా ధర రూ. 150 ఉంది. దీని ధర కూడా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు రైతులకు చెబుతున్నారు.

రైతులపై మోయలేని భారం..



నాకు ఉన్న పొలంలో వేరుశనగా, వరి పంట సాగు చేస్తున్నాను. రైతులు ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య కొట్టుమిట్టాడుతున్న తరుణంలో ఎరువుల కంపనీలు ఇష్టానుసారంగా ఎరువుల ధరలు పెంచుతున్నారు. వ్యవసాయం చేసే రైతులపై అధిక భారం పడుతుంది. ప్రభుత్వం అధిక ధరలను నియంత్రించాలి. – ఈరప్ప, రైతు

సబ్సిడీపై అందజేయాలి



ప్రతీ గ్రామంలో ప్రభుత్వం తరుపున రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి సబ్సిడీపై ఎరువులు అందించాలి. రైతులకు ఇబ్బందులు కలగకుండా పెరిగిన ధరలను తగ్గించాలి. ఈ ధరను కొంత మేర ప్రభుత్వం భరించి రైతులను ఆదుకోవాలి. ఎరువుల ధరలు కొనుగోలు చేయాలంటే రైతులు వెనుకడుగు వేస్తున్నారు. – వెంకటయ్య గౌడ్, రైతు



శిక్షణ పొందుతున్న వలంటీర్లు

మత్తునుంచి యువతను రక్షించాలి

ఎస్‌ఎల్‌సీఏ కోఆర్డినేటర్ శ్రీపాద సుధాకర్

అనంతగిరి: మత్తుపదార్థాల వినియోగం నుంచి యువతను రక్షించాలని, ఈ మహమ్మారిని తగ్గించడానికి మాస్టర్ వలంటీర్లు స్వచ్ఛందంగా పనిచేయాలన్నారు. మత్తుకు బానిసలుగా మారిన వ్యక్తులను డి అడిక్షన్‌లలో చేర్పించాలని ఎస్‌ఎల్‌సీఏ (స్టేట్‌లెవెల్ కో ఆర్డినేటింగ్ ఏజెన్సీ) కోఆర్డినేటర్ శ్రీపాద సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం మాదకద్రవ్యాలు, మద్యపాన దుర్వినియోగం నివారణపై కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో మాస్టర్ వాలంటీర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కొడంగల్ సీడీపీఓ రజిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దశమ్మ, వికారాబాద్ సూపర్‌వైజర్ శాంత, జిల్లా సంక్షేమాధికారి వెంకటేశ్, ఎఫ్ఆర్‌ఓ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



శకటోత్సవాల్లో ట్రాక్టర్‌ను నడుపుతున్న ఎమ్మెల్సీ

కేశంపేట: సమాజంలో ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని కలిగి, ప్రశాంతంగా ఉండాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులోని నంబయ్య గుట్టపైన శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం శకటోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. ఉత్సవాలను కలిసిమెలసి నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేష్, మాజీ సర్పంచులు తలసాని వెంకట్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, మంజుల, మాజీ వైస్ ఎంపీపీ అనురాధ, నాయకులు రమేష్, కరుణాకర్ రెడ్డి, నగేష్, ఆనంద్, గిరియాదవ్, శేఖర్‌పంతులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే పార్టీకి విజయం



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

కొందుర్గు: పార్టీ పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ఐకమత్యంతో పనిచేసి విజయం సాధించాలన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో పోస్టింగ్ చేసే సమయంలో ఎమ్మెల్యే, మండల నాయకుల ఫొటోలు పెట్టకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం సోషల్ మీడియా మండల కమిటీ అధ్యక్షుడిగా దుర్గని శ్రీనును ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు యాదయ్య, రామయ్యగౌడ్, నరేందర్, కృష్ణయ్య, కృష్ణ, చంద్రశేఖర్, రామచంద్రయ్య, పెంటయ్య, మానయ్య, ప్రసాద్, ప్రవీణ్, నర్సింలు, అశోక్, శ్రీను, నిరంజన్, గోపాల్, సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లంబాడీ హక్కుల సభను జయప్రదం చేయండి



సమావేశంలో నాయకులు

కొందుర్గు: షాద్‌నగర్‌లోని సాయిరాజ ఫంక్షన్ హాల్లో ఈ నెల 29న నిర్వహించనున్న లంబాడీల సభను విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లేడ్ చౌదరిగూడ అధ్యక్షుడు రామ్‌చరణ్ నాయక్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లంబాడీలు తమ హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. పార్టీలను పక్కనపెట్టి జాతి కోసం కృషి చేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ మండల ఉపాధ్యక్షులు రవీందర్ నాయక్, రమేష్ నాయక్, సురేష్ నాయక్, నాయకులు చందు, వినోద్, రాజు, మాన్య, మోతీలాల్, రాందాసు, గోపాల్, మంగ్యా, కుమార్, బాల్యానాయక్ పాల్గొన్నారు.

ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

- ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి
- ప్రారంభమైన ఎల్లమ్మ జాతర



పూజలు నిర్వహిస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి

యాలాల: మండలంలోని ముద్దాయిపేటలో రేణుక ఎల్లమ్మ జాతర శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సిడే ఊరేగింపు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఎల్లమ్మ మాతను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రత్యేక పూజలో పట్నం మహేందర్‌రెడ్డి

ఎల్లమ్మ జాతర ఉత్సవాల్లో శాసనమండలి చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు శాలువా కప్పి సన్మానించారు. ఎల్లమ్మమాత కటాక్షంతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన కోరారన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త దేవగారి రాములు, మాజీ సర్పంచ్‌లు బిచ్చన్నగౌడ్, కృష్ణయ్యగౌడ్, గొల్ల గోపాల్, జాతర నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు భానుప్రసాద్‌గౌడ్, సంపత్‌కుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

31న అయ్యప్ప మహా పడిపూజ

తాండూరు: స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 31న అయ్యప్ప స్వామి ఆలయంలో మహా పడిపూజ నిర్వహించనున్నారు. మాలధారణ చేసిన స్వాములతో పాటు నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు, భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా బోనాల జాతర



బోనాలతో మహిళలు

ధారూరు: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం గ్రామదేవత ఎల్లమ్మతల్లికి బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. మార్గశిర మాసం ద్వాదశిలో గ్రామ దేవత ఎల్లమ్మకు నిర్వహించే బోనాల జాతరకు మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఇంటి నుంచి బోనాలతో గుడికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వహించిన ఊరేగింపులో పోతురాజు, శివ సత్తుల విన్యాసాలతో ఆకర్షణీయంగా జాతర సాగింది.

అంబులెన్స్‌లో ప్రసవం



కుటుంబ సభ్యులకు శిశువును అందిస్తున్న 108 సిబ్బంది

కేశంపేట: అంబులెన్స్‌లో ఓ గర్భిణి పండంటి పాపకు జన్మనిచ్చిన సంఘటన మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులోని శుక్రవారం చోటుచేసుకుంది. బోధునంపల్లి గ్రామానికి చెందిన రమ్య పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది ఆమెను కేశంపేట పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ సిబ్బంది గర్భిణిని షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని సూచించారు. అదే అంబులెన్స్‌లో తరలిస్తుండగా వేములనర్వ గ్రామ శివారులోని నంబయ్యగుట్టకు రాగానే పురిటి నొప్పులు అధికమయ్యాయి. వెంటనే అంబులెన్స్‌ను ఆపి కుటుంబ సభ్యుల సహకారంతో ఈఎంటీ సాయికృష్ణ, పైలెట్ దీపక్ సుఖ ప్రసవం చేశారు. రమ్య పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. పాపను కుటుంబ సభ్యులకు అప్పగించిన అనంతరం తల్లీబిడ్డలను షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తుల్జాభవానీ సేవలో మాజీ ఎమ్మెల్యేలు



ఆలయంలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్, మహేశ్‌రెడ్డి తదితరులు

ధారూరు: నాగారంలో శుక్రవారం నిర్వహించిన తుల్జాభవానీ వేడుకలకు మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ మెతుకు ఆనంద్, కొప్పుల మహేశ్‌రెడ్డి హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వీరి వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

మన్మోహన్ సింగ్ సేవలు మరువలేనివి

నియోజకవర్గంలోని ప్రతీ మండలం, ఆయా గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు, రాజకీయ ప్రతినిధులు మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.



బొంరాస్‌పేట: తుంకిమెట్లలో మన్మోహన్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకుల నివాళి



దుద్యాల్: మాజీ ప్రధానికి సంతాపం ప్రకటిస్తున్న కాంగ్రెస్ నాయకులు



తాండూరు టౌన్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పరిగిలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



బంట్వారంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



పూడూరులో..



కుల్కచర్లలోని చౌడాపూన్‌లో...



మర్పల్లిలో ..

సంక్షిప్త వార్తలు

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్: శ్రీ సత్యసాయి భజన మండలి భక్తుడు శ్రీనివాస్‌యాదవ్, హైదరాబాద్‌లోని శంకర్‌కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో నవీన ఆదర్శ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

నేడు శని త్రయోదశి పూజలు

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఏన్కతలలో వెలసిన శనైశ్చర స్వామిని శని త్రయోదశి పూజలకు ముస్తాబు చేశారు. శని అమావాస్య రోజున స్వామి వారికి అత్యంత ప్రీతి పాత్రమైన నల్లని దుస్తులు, నువ్వుల నూనేతో అభిషేకం చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దీని కోసం భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచే బారులు తీరుతారు. మార్గశిర కృష్ణ త్రయోదశి అనురాధ నక్షత్రంతో వస్తున్నందునా జాతక రీత్య శని దశ, అంతర్దశలు, అర్ధాష్టమి, అష్టమి, ఎలినాటి శని నడుస్తున్న వారు దోష నివారణ పూజలు చేయించుకోవాలని ఈఓ నరేందర్ పేర్కొన్నారు.

పీఏసీఎస్ మాజీ వైస్‌చైర్మన్ మల్లేశం మృతి

యాలాల: అనారోగ్యంతో పీఏసీఎస్ మాజీ వైస్‌చైర్మన్ మృతి చెందాడు. కమాల్‌పూర్ గ్రామానికి చెందిన యాలాల సొసైటీ మాజీ వైస్‌చైర్మన్ చాట్ల మల్లేశం, కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం ఉదయం పరిస్థితి విషమించి తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీఏసీఎస్ అధికారులతో పాటు రాజకీయ నాయకులు మల్లేశం మృతదేహానికి నివాళులర్పించారు.

దేశం గర్వించదగ్గ నేత మన్మోహన్‌సింగ్

తాండూరు: దేశ ఆర్థిక సంస్కరణల సారథి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. రెండు సార్లు దేశ ప్రధానిగా కొనసాగిన మచ్చలేని రాజనీతిజ్ఞుడని కొనియాడారు. ఆర్థిక శాఖ మంత్రిగా, దేశ ఆర్థిక సంస్కరణలను తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.